# పురాణాల్లో పిట్టకథలు - "వమన కథనం"

- కాశీనాధుని రాధ

లోకంలో సాధారణంగా ఒకళ్ళకి చేసిన ఉపకారమో, ఇచ్చిన వస్తువో, డబ్బో, వాళ్ళవ్యవహారం నచ్చనప్పుడో, పేచీలూ తగులూ వచ్చినప్పుడో .... కోపం వచ్చి .... తిరిగి నాది నాకిచ్చెయ్యనడం కద్దు. ఇలాంటి సందర్భంలో నీకిచ్చింది వడ్డీతోసహా కక్కు అనో, నేనిచ్చింది ఈ క్షణంలో కక్కు లేదంటే.......అని బెదిరించడం మామూలే. దోషి దొరికినప్పుడు వాడికి నాలుగు తగిలిస్తే నిజం కక్కుతాడు అనడం ఎన్నిసార్లు వినలేదు. ఇది ఒక "way of expression" మాత్రమే అని మీరన్నారంటే... నేను కాదు అంటాను. ఒక మాటిది అక్షరాలా జరిగిందంటే మీరు నమ్మరని నాకు తెలుసు. అందుకే ఇదిగో ఋజువు మరి.....

ఇది వేదకాలం నాటి కథ. వేదాలంటే గుర్తొచ్చింది ... వేదాలు అలిఖితాలని (అంటే వీటిని ఎవరూ వ్రాయలేదని) అంటారు కదా ... మరి సోమకుడు వాటిని పట్టుకు పోతే విష్ణుమూర్తుల వారు చేపరూపంలో వెళ్ళి వాణ్ణి హతమార్చి వేదాలని "restore" చేసారని కదా మత్స్యావతారం కథలో వుంది. (సరిగ్గా ఇప్పుడు నేను బుర్ర గోక్కుంటున్నానన్న మాట) పోనీలెద్దురూ ఆగొడవొదిలేసి అసలు "కక్కు" కథకి వద్దాం.

వ్యాసమహాముని వేదాలని విభజించి తన శిష్యుల్లో పైలుడికి ఋగ్వేదాన్ని, వైశంపాయనుడికి యజుర్వేదాన్ని, జైమినికి సామవేదాన్ని, సుమంతుడికి అధర్వణవేదాన్ని బోధించాడుట. తదనంతరం వాళ్ళు వాళ్ళ శిష్యులకి చెప్పారుట. వైశంపాయనుడు యజుర్వేదాన్ని యాజ్ఞవల్కుడికి బోధించడం జరిగింది. ఒకరోజు ఈగురువు గారికి తన శిష్యుడి మీద బోలెడంత కోపం వచ్చి నేను నీకు చెప్పినవిద్యని కక్కుతావా లేదా? అన్నాడుట. అంతే మరి... మనకుమల్లే అదెలా సాధ్యం? అని వెట్టి ముట్టి ప్రశ్నలు వెయ్యకుండా గభాల్న కక్కేసాడుట. మహర్షులకేం తక్కువ కమండలంలో నీళ్ళు రెడీగా వుంటాయి కదా! వాటిని తక్కిన శిష్యుల పైన జల్లితే వాళ్ళు తిత్తిరి పక్షులుగా మారి - వమన రూపంలో వున్న ఆవిద్యని స్వీకరించారుట. అందుకే యజుర్వేదానికి "తైత్తిరీయం" అనే పేరొచ్చిందట. అదండీ కథ.

దీని వలన మనం నేర్చుకోవలసిందేమిటంటే ....

ఈ మారు "నేనిచ్చింది కక్కు" అనే ముందు జాగ్రత్త సుమండీ. కాస్త ముందూ వెనకా ఆలోచించి మరీ అనండే ఏం లేదు ఒక వేళ అవతలి మనిషి వెనుకటి యాజ్ఞవల్కుడి లాగా "serious" ఘటం అయ్యెతే. ... కమండలం లాంటిది మీదగ్గరేం లేదుగా మరి. చచ్చారన్న మాటే.....ఒక బకెట్టు, మాపు పట్టుకుని క్లీనింగు కార్యక్రమాన్ని మొదలెట్ట వలసిన అగత్యం మీకు పట్టొచ్చు అని చిన్నవార్నింగ్.